# ★ జితేంద్రియుడు ★

భారత యుద్ధం ముగిసింది. ధర్మరాజు హాయిగా రాజ్యాన్ని పాలిస్తున్నాడు. రాజ్యంలో అందరూ క్షేమంగానే వున్నారు అదేసమయంలో ఓనాడు శ్రీకృష్ణుడు ఓ చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఓ వేటగాడి బాణం తగిలింది. ఇంకేముంది! అమాంతంగా ప్రాణాలుపోయాయి. "అన్నయ్యా, శ్రీకృష్ణుడు పరలోకానికి వేంచేశారు;" అని అర్జునుడు ధర్మరాజుతో చెప్పాడు ఈ వార్తవిన్నాక ధర్మరాజు ఏడవలేదు.

ఇంతకూ ధర్మరాజుకి, తత్రాపి, పాండవులకు శ్రీకృష్ణుడు బావవుతాడనే సంగతి మీకు తెలిసే వుంటుంది. అవునా? కాని, ధర్మరాజుమాత్రం విచారించలేదు. మనమైతే ఎంతగా ఏడ్చేవాళ్లమో! బావ చస్తే ఏడుపు రాదూ! గాని, ధర్మరాజు ఏడవలేదు. అందుకే అతన్ని 'జితేంద్రియుడు' అన్నారు పెద్దలు; అంటే ఇంద్రియాల్ని జయించిన వాడన్న మాట. కొన్ని సందర్భాల్లో ఈ 'జితేంద్రియుడు'అనే పదం ఒక్క ధర్మరాజుకే వర్తిస్తుందన్నారు పెద్దలు.

కాస్సేపు బాగా ఆలోచించాక ధర్మరాజు ఇలా అన్నాడు— "చూశావా, తమ్ముడూ, దేవుడైన శ్రీకృష్ణుడే చచ్చిపోయాడుకదా, మరి మనమనగా ఏమాత్రం? మనం కూడా మహాప్రస్థానానికి బయల్దేరాలి." అర్జునుడు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. అదేవిధంగా భీమ, నకుల సహదేవులుకూడా ఊరుకున్నారు. ఈ విషయంలో వాళ్లు ఏంచెప్పినా ధర్మరాజు ఒప్పుకోడనే సంగతి వాళ్లకు తెలుసు కాబట్టి, పెద్దవాడైన ధర్మరాజుయొక్క నిర్ణయానికే అందరూ ఒప్పుకున్నారు. ఈసంగతి ప్రజలక్కూడా తెలిసింది.

ధర్మరాజు, తన తమ్ముళ్ళతో పాటు, రాజ్యాన్ని వదిలి, హిమా

**శశిభూషణ్ పాత్రో**

లయారోహణకు బయల్దేరుతున్నాడనే సంగతి విని, ప్రజల్లో కలకలం బయల్దేరింది. రాజ్యంలో అక్కడక్కడ ఏడ్పులు కూడా వినవచ్చాయి. కొన్ని సభలూ, సమావేశాలూకూడ జరిగాయి. ప్రజలు, ధర్మరాజుయొక్క ఉద్దేశాన్ని మార్చుకోమని విన్నపాలు పంపారు; ప్రార్థించారు, ఎన్నోవిధాల ప్రయత్నించారు; కాని లాభం లేకపోయింది. ధర్మరాజు తన నిశ్చయాన్ని మార్చుకోలేకపోయాడు.

పాండవులందరూ కాషాయ వస్త్రాల్ని ధరించారు. ద్రౌపది కూడా వాళ్లతోపాటు బయల్దేరింది. ధర్మరాజు వెంట ఓ కుక్కకూడా బయల్దేరింది. అందరూ సముద్రతీరానికి చేరుకున్నారు. అక్కడ అర్జునుడు తన గాండీవాన్ని సముద్రంలో పారేశాడు.

ఈ మహాప్రస్థాన సందర్భంలో వారెన్నో దేశాల్ని చూశారు. హిమాలయారోహణ మిగిలిపోయింది. కుక్కకూడా వాళ్ళ వెంటవెంటనే వుంది. దుర్గమమైనదారి. అంతటా మంచు. చల్లగాలి శరీరాన్ని ఒణికించేస్తోంది. ఊపిరి పీల్చటంకూడా దుర్భరంగా వుంది. అసలే హిమాలయపర్వతం. అది హిమానికి ఆలయం.

ఈనాడు వైజ్ఞానిక ఉపకరణాలతో హిమాలయారోహణ చేసినప్పటికీ తాతలు దిగివస్తున్నారు. అలాంటిది మన పాండవులకేముంది—మామూలు వస్త్రాలు తప్ప! చలికి తాళుకోలేక, మంచులో నడవలేక, ఆ మంచులో ద్రౌపది కూరుకుపోయింది. బయటికి రాలేకపోయింది. అంటే అక్కడే ద్రౌపది చచ్చిపోయిందన్నమాట. ధర్మరాజు ఆగలేదు. తక్కిన సోదరులూరుకుంటారా?

మహా పతివ్రతయిన ద్రౌపది ఈవిధంగా చనిపోయిందంటే వాళ్లకాశ్చర్యం కలిగింది. దీనిక్కారణం తెలుసుకోవాలి. ఎలా? ఎవరడుగుతారు? నువ్వంటే నువ్వనుకున్నారు. ఆఖరికి భీముడే చొరవచేసి అడిగాడు. వెంటనే ధర్మరాజు అన్నాడు కదా — "ధనంజయుని పట్ల ద్రౌపదికి ప్రత్యేకాభిమానం

# ★ జితేంద్రియుడు ★

వుండేది. ఆ భేదబుద్ధియొక్క ఫలితమే ఇది."

వెనక్కి తిరిగి చూడకుండా ధర్మరాజు ప్రయాణం సాగిస్తూనే వున్నాడు; హిమాలయ దుర్గమపథం ఓ లెక్కలోంది కాదన్నట్టుగా అయితే, ఈసారి సహదేవుడు నడవలేక వెనకబడ్డాడు. అలిసిపోయాడు. కాళ్లు బరువుగా పడుతున్న కారణంచేత, అతనుకూడా మంచులో కూరుకుపోయాడు. ఆ బ్రహ్మాండమైన మంచులో సహదేవుడు దేహయాత్రను చాలించాడు. మళ్లీ భీముడు కారణమడిగాడు—

"తనకన్నా బుద్ధిమంతుడు, ప్రాజ్ఞుడు, అఖండ మేధాశక్తి గలవాడు ఈ భువిలో లేడని, అహంభావంతో వుండేవాడు. ఇదే అతని పతనానికి కారణం," అన్నాడు ధర్మరాజు. ప్రయాణం సాగుతోంది. పెద్దవాడిని ఎదిరించలేక, తక్కిన సోదరులుకూడా అనుసరించారు. కుక్కకూడా ఎక్కడా ఆగలేదు.

ద్రౌపదీ సహదేవుల వియోగాన్ని నకులుడు సహించలేకపోయాడు. వాళ్ళ విషయమై ఆలోచిస్తూ విచారిస్తూ మెల్లిగా నడుస్తో, కాస్త వెనకబడ్డాడు. అప్పటికి చలియొక్క ప్రభావమూ, మంచుయొక్క ప్రభావమూ కాస్త హెచ్చు స్థాయిలో వున్నందువల్ల, నకులుడు కూడా వాటికి తాళుకోలేక చచ్చి ఊరుకున్నాడు. మళ్ళీ భీముడు అడిగాడు - "తనకన్నా అందగాడు ఈ భువిలో నభూతో నభవిష్యతి అన్నట్టుగా గర్వించాడు. అతని గర్వమే అతన్ని మననుండి వేరు చేసింది;" అన్నాడు ధర్మరాజు.

ఈ ముగ్గురూ పోయినా ధర్మరాజు చలించలేదు. అందుకే అతన్ని జితేంద్రియుడన్నారేమో! కాని అర్జునుడు మాత్రం సహించలేకపోయినాడు. హిమాలయపర్వతాల మీదకు వెడుతున్నకొద్దీ చలి ఎక్కువ కాసాగింది. అదే కారణంచేత అర్జునుడు కూడా ప్రాణాలు విడిచేశాడు. భీముని మనస్సులో వున్న విచారం ఇంతా అంతా కాదు. కాదు మరి! ఒక్కొక్కరే ఆవిధంగా చస్తోంటే, మీరూ నేను సహించగలమా? భీముడు కూడా సహించలేక అడగనే అడిగాడు — వెంటనే ధర్మరాజు ఇలా జవాబిచ్చాడు - "మిథ్యాభిమానంచేత ఒకే రోజున శత్రువుల నందరినీ హతమార్చేస్తానని అర్జునుడన్నాడు. గాని, అలా చెయ్యలేకపోయాడు. ఆమిథ్యాశక్తి వల్లనే అతను చనిపోయాడు."

కుక్కతోపాటు ధర్మరాజు మళ్ళీ పయనం సాగించాడు. ఎంత ప్రయత్నించినప్పటికీ సోదరుల వియోగాన్ని భీముడు సహించలేకపోయాడు. ఆఖరికి అతను కూడా ప్రాణాలు ఒదుల్తూ ఒదుల్తూ ఆఖరుసారి ప్రశ్నించాడు - "అన్నయ్యా, నేను మీ ముద్దు తమ్ముణ్ణి. నేనేం పాపంచేశా - నని మీనుండి దూరమవుతున్నానో చెబుతారా? —

"నువ్వు అతిగా భోంచేశావు. మరెవర్నీ ఖాతరు చెయ్యకుండా నీబలాన్ని నువ్వే పొగుడుకున్నావు. ఇదే కారణం," అన్నాడు ధర్మరాజు. ఇద్దరే మిగిలిపోయారు.

ధర్మరాజు - అతని వెంటకుక్క. చలిగాలి ఘోరంగా వుంది. ధర్మరాజు పయనం సాగుతునేవుంది. ధర్మరాజు దృఢనిశ్చయం ఇంద్రాసనాన్ని కదిలించేసింది. ఇంద్రుడు ప్రత్యక్షమై తన రథాన్ని సమర్పిస్తూ స్వర్గానికి రమ్మన్నాడు.

ఎబ్బే! ఆమాత్రంతో ఆమహాపురుషుడు లొంగిపోతాడా! అన్నాడుకదా — "దేవేంద్రా, నా తమ్ములందరూ కూడా నాతోపాటు రావాలి. వాళ్ళను వదిలి నేను స్వర్గానికి రాదల్చుకోలేదు. ద్రౌపదిని కూడా వదలటానికి వీల్లేదు."

"ఆర్యా, మీ నలుగురు తమ్ములు, ద్రౌపదితోపాటు అప్పుడే అక్కడికి చేరుకున్నారు. గాబట్టి, సందేహించకుండా మీరు ఈ శరీరంతో నాతో ఈ రథం మీద స్వర్గానికి రావాలి;" అన్నాడు దేవేంద్రుడు.

"మరి, ఈ కుక్క నాతోపాటు ఇంతవరకు పయనం సాగిస్తూ వచ్చింది. దీని స్వామిభక్తి కొనియాడదగింది. ఇదికూడా నాతో స్వర్గానికి రావాలి. ఏవైభవంకోసమైతే నాభక్తుణ్ణి త్యజించే అవసరం వస్తుందో ఆవైభవం నాకు అవసరం లేదు;" అన్నాడు ధర్మరాజు. అనటం తడవుగా కుక్క సాక్షాత్తు యముడుగా మారిపోయింది. యమధర్మరాజుయొక్క వరంవల్ల ధర్మరాజు పుట్టాడని మీకు తెలిసే వుంటుంది. తన కొడుకు ఇంత

గొప్పవాడైనందుకు యముడు చాలా సంతోషించాడు.

దేవగణమంతా అక్కడ ప్రత్యక్షమై ధర్మరాజుని శరీరంతోనే స్వర్గానికి తీసుకుపోయారు. స్వర్గం చేరుకోగానే దేవతలతో ధర్మరాజు ఇలా అన్నాడు – "మహానుభావులారా! నా తమ్ముళ్లు, ద్రౌపది ఇక్కడ కనబడలేదే. వాళ్లు ఏలోకములోనున్నారో, అది మంచిది కానీ, చెడ్డదే కానీ, నన్ను కూడా అక్కడికే తీసుకువెళ్లండి." ధర్మరాజు ఎంతపుణ్యార్జన చేశాడో, అంతగా మిగతా వాళ్లు చెయ్యలేదనీ, వాళ్లు ఆ స్థానానికి అర్హులు కారనీ ఇంద్రుడు మనవి చేసుకున్నాడు. అప్పటికీ ధర్మరాజు ఒప్పుకోలేదు. ఇంద్రుడు అతనినిశ్చయాన్ని మార్చలేకపోయాడు.

అతని సోదరుల్ని చూపించమని ఒక దూతను పంపించాడు. దూత వెంట ధర్మరాజు బయల్దేరాడు. అయితే ఆ దారి చాలా భయంకరంగా వుంది. దారంతా రక్తమాంసాలు, క్రిమికీటకాదుల్తో నిండివుంది. ఇంకా... ఇంకా...... దాన్ని ధర్మరాజు వర్ణించాల్సిందే గాని, మనకు చాతకాదు. మనం చూడలేదు కాబట్టి. మనం కేవలం చదివాం. విన్నాం, అంతే.

చాలా దూరం నడిచాక ధర్మరాజు దూతతో అన్నాడు– "ఇంకా మనమెంతదూరం వెళ్లాలి?" "ప్రభో! మీరెప్పుడైతే అలిసిపోతారో అప్పుడే మిమ్మల్ని స్వర్గానికి తీసుకురమ్మని దేవేంద్రుని యాజ్ఞ;" అన్నాడు దూత. అక్కడున్న దుర్గంధ పూరితమైన వాతావరణంలో ధర్మరాజుకి తల దిమ్మెక్కిన ట్లనిపించింది. వెనక్కి తిరిగాడు.

అప్పుడే చీకట్లో ఓ గొంతు వినిపించింది – "ధర్మరాజా! దయచేసి కాస్సేపు ఆగండి. మీరాకవల్ల ఇక్కడ పవిత్రమయిన వాయువు దొరికింది." "ఎవరుమీరు?" గట్టిగా కేకవేశాడు ధర్మరాజు. "మేం నీ తమ్ముళ్లం. ద్రౌపది కూడా మాతోనేవుంది," అంటూ జవాబు వచ్చింది. చూశారా, పాఠకులూ! మీకు జ్ఞాపకముందా – ధర్మరాజు యుద్ధభూమిలో ఓచిన్న అబద్ధం చెప్పాడు. అంటే, తన జీవితంలో ఒకే ఒక అబద్ధం చెప్పాడు– 'అశ్వత్థామ చచ్చిపోయాడు (ఏనుగు)' అన్నాడు ధర్మరాజు. ఆ ఒక్క అబద్ధంకోసం ఆకాస్త నరకాన్నీ అనుభవించాడు. కాబట్టి ఎప్పుడూ అబద్ధాలు చెప్పకండేం! అది చాలా పాపం!

అయితే ఆ జవాబు వినగానే ధర్మరాజు చాలా విచారించాడు. "నా వాళ్లు ఇక్కడే వున్నారు గాబట్టి, నేనూ ఇక్కడే వుంటాను." అన్నాడు ధర్మరాజు. వెంటనే అక్కడి చీకటి పటాపంచలైంది. ఆ ప్రదేశమంతా స్వర్గంగా మారింది. అందరూ కలుసుకొన్నారు. కథ కంచికీ మనం ఇంటికీ

★


అమ్మకమునకు సిద్ధముగా నున్నది.

# మంచీ-చెడూ

రచయిత:

'శారద'

★

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికనుండి పునర్ముద్రితము

మీ కాపీ నేడే రిజర్వు చేసుకోండి.

వెల రు. 2-0-0

★

అంధ్రగ్రంథమాల, మద్రాసు-1